ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించాలి

సిపి డాక్టర్ అనురాధ

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించుకోవాలని సీపీ డాక్టర్ అనురాధ సూచించారు. సిద్దిపేటలోని కోమటిచెరువు వద్ద మంగళవారం వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నిమజ్జనం జరిగే ప్రదేశాలలో సీసీ కెమోరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. మండపాల నిర్వహకులు, కార్యవర్గ సభ్యులు పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలలోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. డిజెలకు అనుమతిలేదన్నారు. నిమజ్జన కార్యక్రమంలో సాంప్రదాయ బద్దంగా భక్తిపాటలు, దేవుని పాటలు పాడుకుంటూ నిర్వహించుకోవాలన్నారు. శోభాయాత్రలో టపాసులు కాల్చరాదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, ఎసిపి రవీందర్‌రెడ్డి, సిఐలు వాసుదేవరావు, విద్యాసాగర్, ఎస్ఐలు, విద్యుత్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

మునిసిపల్ సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

దుబ్బాక(అక్బర్‌పేట భూంపల్లి), సెప్టెంబర్ 2, ప్రభాతవార్త :
ఇంటి కొలతలు తీసుకునేందుకు వెళ్లిన మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించి, విధులకు ఆటంకపరిచిన ఆర్ఎంపి వైద్యుడిపై కేసు నమోదైన సంఘటన దుబ్బాకలో సోమవారం రాత్రి జరిగింది. నెల రోజుల క్రితం 14వ వార్డులో ఆర్ఎంపి వైద్యుడు మర్గల రత్నాకర్ నూతన ఇంటికి సంబంధించి కొలతలు తీసుకునేందుకు మున్సిపల్ సిబ్బంది రెండుసార్లు వెళ్లారు. అయితే ఇంటి యజమాని రత్నాకర్ వారిని దూషిస్తూ కొలతలు తీసుకోకుండా అడ్డుపడి, అక్కడి నుంచి పంపించేశాడు. దీంతో మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ సిబ్బందితో కలిసి స్వయంగా కొలతలు తీసుకునేందుకు వెళ్లగా, మరోసారి కమిషనర్‌పై అనుచిత వాఖ్యలు చేస్తూ, దురుసుగా ప్రవర్తించాడు. దీంతో మంగళవారం రమేష్‌కుమార్ ఆర్ఎంపి వైద్యుడు రత్నాకర్‌పై ఫిర్యాదుచేయగా, దుబ్బాక పోలీసులు కేసు నమోదుచేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిపినా, సిబ్బంది విధులకు ఆటంకపరిచినా, బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్యురాలితో మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

బస్తీ దవాఖానను
జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): పట్టణంలోని కోటమైసమ్మ వద్ద ఉన్న బస్తీ దవాఖానను సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్, రికార్డులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి ఎంత మంది రోగులు వస్తున్నారు, డెంగ్యూ పరీక్షలు నిర్వహిస్తున్నారా అని సంబంధిత మెడికల్ ఆఫీసర్‌ను అడగగా జ్వరం తగ్గని ప్రతి ఒక్కరికి డెంగ్యూ పరీక్షలు నిర్వహిస్తున్నామని, శాంపిల్స్‌ను చూపిస్తూ వీటిని సాయంత్రం టీ-హబ్ బృందం వచ్చి తీసుకెళ్తారని, టెస్ట్ రిపోర్ట్‌లు సైతం త్వరగా వస్తున్నాయని కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్‌కు మెడికల్ స్పెషల్ ఆఫీసర్ బిపి చెక్‌చేసి నార్మల్‌గా ఉందని, కలెక్టర్‌కు మల్టీ విటమిన్ టాబ్లెట్స్ అందించారు. అలాగే ఇంటింటి ఫీవర్ సర్వేలో భాగంగా డెంగ్యూ కేసుల గురించి అడగగా బస్తీ దవాఖాన ముందుగల ఇంటిలో డెంగ్యూ పాజిటీవ్ కేసు వచ్చిందని వైద్యులు కలెక్టర్‌కు చెప్పగా డెంగ్యూ వచ్చిన అమ్మాయిని, తల్లిదండ్రులను పిలిపించి రిపోర్ట్ చెక్‌చేసి ప్లేట్లెట్స్ కౌంట్ లక్ష కంటే తక్కువ ఉన్నందున సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వెళ్లాలని, అక్కడ మెరుగైన వైద్యం అందుతుం దని ప్రైవేట్ దవాఖానకు వెళ్లవద్దని సూచించారు.

సింగూరు ప్రాజెక్టు రెండు గేట్ల మూసివేత

5 గేట్ల ద్వారా దిగువకు వరద నీరు..ఇన్‌ఫ్లో 54273 క్యూసెక్కులు

సింగూరు ప్రాజెక్టు

పుల్‌కల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త: సింగూరు ప్రాజెక్టు 2 గేట్లు మూసేసి 5 గేట్ల ద్వారా వరద నీటిని దుగువకు వదులుతున్నారు. మంగళవారం మధ్యాహ్న సమయానికి ప్రాజెక్టులోకి వరద ప్రవాహం తగ్గడంతో 4,6 క్రస్ట్‌గేట్లు మూసేసి 8,9,10,11,16 గేట్లద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 54273 క్యూసెక్కులుగా నమోదు కాగా 5 క్రస్ట్ గేట్ల ద్వార 52703 క్యూసెక్కులు, జల విద్యుత్ కేంద్రం లోని ఒక టర్బయిన్ ద్వార 1570 క్యూసెక్కులు (మొత్తం 54273 క్యూసెక్కులు)గా ఒట్‌ఫ్లో నమోదయింది. ప్రాజెక్టుకు కర్ణాకట, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. మంగళవారం నాటికి ప్రాజెక్టులో 521.185 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు రికార్డులు దృవీకరిస్తున్నాయి.

7న మల్లన్న ఆలయం మూసివేత

కొమురవెల్లి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయాన్ని ఈనెల 7న చంద్ర గ్రహణం సంబవించుచున్నందున మహనివేదన అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ప్రధాన ఆలయం, అనుబంధ అలయాలను మూసివేయడం జరుగుతుందని ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. తిరిగి ఈనెల 8న ఆలయ సంప్రోక్షణ తదుపరి ప్రాత:కాల పూజల అనంతరం ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనం, ఆర్జిత సేవలు యదావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

రేషన్ డీలర్ల జిల్లా కోశాధికారిగా నాగభూషణం

దుబ్బాక,(అక్బర్‌పేట భూంపల్లి) సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : సిద్దిపేట జిల్లాస్థాయి రేషన్ డీలర్ల నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించడం జరిగింది. జిల్లా మొత్తంలో 686 డీలర్లతో సమావేశం ఏర్పడగా అక్బర్ పేట భూంపల్లి మండలానికి సంబంధించిన జూలూరి నాగభూషణంను సిద్దిపేట జిల్లా రేషన్ డీలర్ అసోసియేషన్ కోశాధికారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండలం నుంచి కోశాధికారిగా అవకాశం ఇచ్చినందుకుగాను అక్బర్‌పేట భూంపల్లి రేషన్ డీలర్లు తరపున హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల నారాయణరెడ్డి, రాజు, నర్సింలు, దుర్గారెడ్డి, స్వామి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలంటూ

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన

సంగారెడ్డి మున్సిపాలిటీ సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : రాష్ట్రంలో విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ ఫీజురీయంబర్స్ మెంట్స్, స్కాలర్‌షిప్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఐటిఐ కాలేజ్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేసి మానవహారం కార్యక్రమం నిర్వహించారు. మా స్కాలర్‌షిప్స్ మాకు ఇవ్వాలి, స్కాలర్‌షిప్స్ భిక్షకాదు, మా హక్కు అంటూ నినాదాలిచ్చారు. ఈసందర్భంగా జరిగిన మహా ర్యాలీ మానవహారంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రోళ్ల మహేష్, టీ రాజేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల బకాయి, కాంగ్రెస్ ఇవ్వాల్సిన నిధులు కలిపి 8,158 కోట్లు నిధులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, పావని, శ్రావణి, జి.శంకర్, అభి, చిన్న, సందీప్, రజనీకాంత్, రిషి, మార్క్స్, సిద్దు, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళనచేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

దేశానికే ఆదర్శం కాళేశ్వరం ప్రాజెక్టు

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:
బిఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే ఆదర్శం అని బిఆర్ఎస్‌పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లి ఖార్జునరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ అన్నారు. మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిద్దిపేట టూ హన్మకొండ జాతీయ రహదారిపై రాస్తారోకో(ఆందోళన) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌పై కావాలనే ప్రభుత్వం బురద చల్లాలని చూస్తోందని, రాష్ట్రంలో ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను దారిమళ్లించేందుకే కెసిఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు.అనంతరం గ్రోమోర్ రైతు సేవా కేంద్రం ఎదుట యూరియా కోసం బారులు తీరిన రైతుల వద్దకు ర్యాలీగా చేరి వారికి మద్దతుగా ధర్నా నిర్వహించారు. ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకుని నచ్చజెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆకుల రజితవెంకన్న, వైస్ చైర్మన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపిపిలు లకావత్ మానససుభాష్, మాలోతు లక్ష్మీభీలునాయక్, ఆకుల వెంకట్, మాజీ జడ్పిటిసి భూక్య మంగశ్రీనివాస్, పార్టీ నాయకులు కొంకటి రవి, పెరుక భాగ్యరెడ్డి, వాల నవీన్‌రావు, బోజు రమాదేవి రవిందర్, బొల్లి శ్రీనివాస్, బొజ్జ హరీష్, లక్ష్మన్‌నాయక్, కూతాటి విజయ్‌భాస్కర్, కందుకూరి సతీష్, పాకాల శ్యాం సుందర్‌గౌడ్, పెన్నబోయిన శ్రీనివాస్, సదానందం, బత్తుల జగ్జీవన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కవిత ప్లెక్సీ దగ్ధం...

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీఎంపి సంతోష్‌కుమార్‌లపై కవిత చేసిన ఆనుచిత వ్యాఖ్యలకు నిరసనగా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసి నిరసనగా కవిత ప్లెక్సీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవిత బిజెపికి అమ్ముడుపోయి, ఆ పార్టీ నాయకులు ఆడించినట్లు ఆడుతుందని విమర్శించారు. ఆమెపై ఉన్న కేసులు మాఫీ చేయించుకోవడం కోస ం బిఆర్ఎస్ నాయకులను కించపరచినట్లు మాట్లాడుతుందని మండిపడ్డారు. బిఆర్ఎస్ అంటేనే కేసిఆర్, కేసిఆర్ అంటేనే బిఆర్ఎస్ అన్నారు. పార్టీ నాయకులను పార్టీని కించపరిచేలా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని వారు హెచ్చరించారు.

అక్కన్నపేటలో...

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎమ్మెల్సి కవిత మాజీమంత్రి హరీష్‌రావు, మాజీ రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్‌లపై చేసిన ఆరోపణలకు నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ ఎంపిపి మాలోతు లక్ష్మీభీలు నాయక్ పార్టీశ్రేణులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. అనంతరం కవిత దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి లింగాల శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు గద్దల రమేష్, కుమార్, నాయకులు దేవన్‌నాయక్, కిషన్ ఉన్నారు.

మాట్లాడుతున్న డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుయాదవ్

హరీష్‌రావు జైలుకు వెళ్లడం ఖాయం

డిసిసి ప్రధాన కార్యదర్శి నాగరాజ్‌యాదవ్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై జస్టిస్ పిసి ఘోష్ నివేదికను ప్రభుత్వం సిబిఐకి ఇచ్చిందని త్వరలోనే మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు జైలుకు వెళ్లడం ఖాయమని డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. సిద్దిపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం పేరుతో హరీష్‌రావు కోట్ల రూపాయాలు దోచుకొని తెలంగాణ ప్రజలను నట్టెట ముంచారని ఆరోపించారు. అధికారంలో ఉన్నంత కాలం ఏ ప్రతిపక్ష నాయకుడిని ఎదగకుండా అక్రమ కేసులు పెట్టించి అణగదొక్కడాని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నంత కాలం ప్రతిపక్షం లేకుండా అక్రమ కేసులు పెట్టించినందులకే బాధితులు ఉసురు తగులుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే హరీష్‌రావు కోర్టులకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం అవినీతిపై సిఎం రేవంత్‌రెడ్డి సిబిఐ చేత విచారణ చేపిస్తే బిఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్‌లోనే అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గణేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, సంపత్, పిల్లి బాబు, కోడెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.500 కోట్లతో సంగారెడ్డి మహబూబ్ సాగర్

చెరువు సుందరీకరణ: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :
సంగారెడ్డి మహబూబ్ సాగర్ చెరువు సుందరీకరణ పనులను రూ.500 కోట్లతో చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి మహబూబ్ సాగర్ చెరువు సుందరీకరణ పనులపై హెచ్ఎండిఏ, మున్సిపల్ నీటిపారుదల శాఖ, గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌సాగర్ చెరువులో చేపట్టబోయే సుందరీకరణ పనులకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ హెచ్ఎండిఏ అధికారులు ప్రదర్శించారు. మహబూబ్‌సాగర్ చెరువు మధ్యలో భారీ శివుడి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో నుండి వచ్చే డ్రైనేజీ వాటర్ నేరుగా మహబూబ్‌సాగర్ చెరువులోకి కలవకుండా రానున్న 25 సంవత్సరాలకు సరిపోయేలా 23.5ఎంఎల్‌డి ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసేలా డిజైన్ సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. మహబూబ్ సాగర్ చెరువును టూరిజం, రిక్రియేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దాలన్నారు. హైవే నుండి ఐఐటి పక్కనుండి మహబూబ్ సాగర్ చెరువు వరకు 100 ఫీట్ల లింక్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్‌కు నిర్మలాజగ్గారెడ్డి వివరించారు. ప్రాజెక్టు రెండోదశలో 265కోట్లతో డిసిల్టింగ్ చేసేలా ప్రణాళిక ఉందని హెచ్ఎండి అధికారులు తెలిపారు. చెరువు మధ్యలోఉన్న సోమేశ్వరాలయంను అభివృద్ధి చేయనున్నట్లు మెహబూబ్‌సాగర్ కట్టవెడల్పు స్టైక్లింగ్ ట్రాక్ రెండు లైన్ల బిటిరోడ్డు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. చెరువు మధ్యలో రూ.20 కోట్లతో భారీ శివుడి విగ్రహం, వాచ్‌టవర్ ఏర్పాటు, కట్ట నుండి విగ్రహం వరకు కేబుల్‌బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రాజెక్టు వివరాలను కలెక్టర్‌కు వివరిస్తున్న హెచ్ఎండిఏ, అధికారులు

త్వరలో సిఎంతో సుందరీకరణ పనులకు శంకుస్థాపన: నిర్మల జగ్గారెడ్డి

రూ.500 కోట్లతో చేపట్టబోయే మహబూబ్ సాగర్ చెరువు సుందరీకరణపనులకు త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ మహబూబ్ సాగర్ చెరువు అభివృద్ధి కోసం లాండ్ ఆక్విజేషన్ కోసం రైతుల నుండి భూమిని తీసుకునే సమయంలో ప్రైవేట్ మార్కెట్ రేట్‌ను పరిగణలోకి తీసుకొని ప్రతి పాదనలు సిద్ధం చేయాలని సంగారెడ్డి ఆర్డీవోకు సూచించారు. సమీక్ష అనంతరం కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి సాగర్ చెరువును టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మహబూబ్ సాగర్ చెరువును సందర్శించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎవరైనా చర్యలు తప్పవు

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్ సెప్టెంబర్ 2, ప్రభాతవార్త: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కల్వకుంట్ల కవితని బిఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణా రాష్ట్రాన్ని సాధించేందుకు కేసీఆర్ ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని చివరకు ప్రజల ఆశయాలను నెరవేర్చారని ఆమె గుర్తుకు చేశారు,ఇకపై ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఆయన ధైర్యంగా ఎదుర్కొని తెలంగాణా ప్రజల అభీష్టానికి అనుగుణంగా ముందుకు నడిపిస్తారని నమ్మకాన్ని ఆమె వ్యక్తం చేశారు,తప్పుచేస్తే కుటుంబ సభ్యులనైనా సహించబోమని పార్టీ రజతోత్సవ సభలో గతంలో కేసీఆర్ చెప్పారు,ప్రస్తితం కన్న కూతురు కంటే కూడా కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తు ముఖ్యమని కెసిఆర్ తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమన్నారు,పార్టీ కంటే ఎవరూ పెద్దవారు కాదనే విషయం ఈ నిర్ణయంతో స్పష్టమైందని,గతంలో తెలంగాణా రాష్ట్రం కోసం ప్రాణ త్యాగానికి సైతం సిద్ధపడ్డారని పేర్కొంటు నఆగా ప్రస్తుతం పార్టీ కోసం కన్నబిడ్డను వదులుకున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు, ఎంతమంది పార్టీ కి ద్రోహం చేసినా తెలంగాణా ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్న బీఆర్ఎస్ పార్టీ కి ఎటువంటి ముప్పు లేదని ఆమె స్పష్టం చేశారు, పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎటువంటి ఇహ.పర. భేదాలు లేవని అన్నారు.

ఈ మేరకు కవిత విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయం మరోసారి దీనికి నిదర్శనమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో
కెసిఆర్, హరీష్‌రావు అక్రమాలు బట్టబయలు

-మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు బయటపడడంతో కెసిఆర్, హరీష్‌రావులు అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ విమర్శించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, వారికి జైలుశిక్ష తప్పదన్నారు. కోర్టులను అడ్డం పెట్టుకొని తాత్కాలికంగా ఉపశమనం పొందుతారుతప్ప వారు చేసేదేమీ లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందనే వాస్తవం బట్టబయలయిందని, అసెంబ్లీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానంతో కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగించి సిఎం రేవంత్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయని సిబిఐకి అప్పగించాలని బిజెపి నేతలు డిమాండ్ చేసినట్లు గుర్తుచేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సిబిఐ దర్యాప్తుకు కేంద్రంలోని మోడి సర్కార్ అడ్డుపడకుండా పారదర్శకంగా దర్యాప్తు చేపట్టి అవినీతి చేసిన వారికి శిక్షపడే విధంగా చేయాలన్నారు. పిసి ఘోష్ కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు.రాష్ట్ర ఖజానాను దివాలా తీయించి అప్పనంగా కొట్టేసిన వేల కోట్లు తిరిగి కెసిఆర్ కుటుంబం నుండి కక్కించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, సుఖేందర్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ వాహిద్, అక్కారం యాదగిరి,నర్సా గౌడ్, కొండపోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, డిసిసిబి మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, కన్నాయాదవ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండి.షరీఫ్, తంజుముల్ మజీద్ కమిటీ అధ్యక్షుడు మతీన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అజార్, జిల్లా ప్రధానకార్యదర్శి డప్పు గణేష్, గాడిపల్లి శ్రీనివాస్, నక్క రేగొండ, బెజుగామ శివారెడ్డి, పెర్క నాగరాజు, జంగం రమేష్‌గౌడ్, జహీర్, అమరేందర్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, జహంగీర్, ఆంజనేయులు, వెంకట్‌గౌడ్, పొద్దుటూరి వేణు, హుస్సేన్, మన్నె అరుణ్‌కుమార్, పూజారి శ్రావణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్దార్‌ఖాన్

వినాయకునికి బిఆర్ఎస్ నాయకుల వినతిపత్రం



వినాయకుని విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

అక్కన్నపేట, సెప్టెంబరు 2, ప్రభాతవార్త : రాష్ట్రంలోని రైతులకు కావాల్సినంత యూరియా సరఫరా చేసేందుకు కావాల్సిన శక్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించాలని అక్కన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెసరు సాంబరాజు, మాజీ ఎంపిపి మాలోతు లక్ష్మీభీలునాయక్‌ల ఆధ్వర్యంలో వేడుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియాకు కొరత లేకుండా చూసుకోవాలని కోరుతూ ఆ భగవంతునికి వినతిపత్రాన్ని అందజేశారు.అనంతరం గణపతిబప్పా మోరియా రావాలయ్యా యూరియా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

ఎమ్మెల్యే చింత ప్రభాకర్

ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ సెప్టెంబర్ 2, ప్రభాతవార్త: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ అబద్దపు ప్రచారానికి నిరసనగా మంగళవారం సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో నల్లకండువాలు ధరించి రాస్తారోకో, నిరసన ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ పైశాచిక ఆనందం పొందడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ప్రపంచంలోనే అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ఓర్వలేక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు, తప్పుడు ప్రచారం చేస్తుందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై తప్పుడు ప్రచారాలు మానుకొని పాలన మీద దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం,మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ

కొల్చారం, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

కొల్చారం మండల పరిధిలోని రంగంపేట గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి అండర్ 14, అండర్ 17 బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్ 14 కబడ్డీ విభాగంలో మొదటి బహుమతి రంగంపేట ఉన్నత పాఠశాల రెండవ స్థానంలో చిన్నగనాపూర్ ఉన్నత పాఠశాల జట్లు గెలుపొందాయి. అండర్ 17 కబడ్డీ బాలుర విభాగంలో మొదటి స్థానంలో రంగంపేట ఉన్నత పాఠశాల, రెండో అంసన్పల్లి ఉన్నత పాఠశాల జట్లు నిలిచాయి. అలాగే ఖోఖో అండర్ 14 బాలికల విభాగంలో మొదటి స్థానంలో కొల్చారం ఉన్నత పాఠశాల రెండవ స్థానంలో అంశానిపల్లి ఉన్నత పాఠశాల నిలిచాయి. అండర్ 17 ఖోఖో విభాగంలో మొదటి స్థానంలో రంగంపేట ఉన్నత పాఠశాల, రెండవ స్థానంలో అంశానిపల్లి ఉన్నత పాఠశాల జట్లు గెలుచుకున్నాయి. గెలుపొందిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని మండల విద్యాధికారి సత్యనారాయణ రావు అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రంగంపేట పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

సిబిఐకి కాళేశ్వరం అప్పజెప్పడం అంటే పూర్తిగా ప్రాజెక్టును మూసేయడమే

-బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

ధర్నా చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

బిఆర్ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాలమేరకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి నాయకత్వంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ పైన కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా మంగళవారం నారాయణ ఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్‌పార్టీ నాయకులు మాట్లాడుతూ సిబిఐకి కాళేశ్వరం అప్పజెప్పడం అంటే పూర్తిగా ప్రాజెక్టును మూసేయడమే అని, తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును సిబిఐకి అప్పజెప్పడం వెంటనే ఉప సంహరించుకోవాలి. లేదంటే ముమ్ముందు ధర్నా కార్యక్రమాలు ఇంకా ఉధృతం చేస్తామని, బెదిరింపులు కేసులు మా పార్టీకి కొత్తకాదని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్, బుజ్జి, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, పట్టణపార్టీ అధ్యక్షులు నగేష్‌సేట్, మాజీ ఎంపిటిసి ముజా మిల్, మాజీ మండల కాప్షన్ సభ్యులు నవాబ్, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ, మాజీ కౌన్సిలర్ విట్టల్, మాజీ కోఆప్షన్ సభ్యులు లాయక్, గోపాల్, మాజీసర్పంచ్‌లు వెంకటేశం, సిద్దు, సురేష్, నాయకులు కొమ్ము శేఖర్, నర్సింలు, అబ్బు పటేల్ తదితరులు ఉన్నారు.

యూరియా కోసం రైతన్నల గోస

పిఎసిఎస్ కార్యాలయం వద్ద వరుసలో రైతన్నలు

శివ్వంపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

రైతులు ఎంతోకష్టపడి పండిస్తున్నపంటకు యూరియా కోసం పిఎస్‌సిఎస్ కార్యాలయం వద్ద ఉదయంనుంచి వరుసలో నిలబడి పడిగాపులు కాస్తున్నారు. గత వారంరోజుల నుండి యూరియా కోసం వరుసలో నిలబడి విసుగుచెంది ధర్నా కార్యక్రమాలు నిర్వహించినా ఫలితంలేకుండా రైతులు యూరియా కోసం గోస పడుతూనే ఉన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత వారంరోజుల నుండి యూరియా కోసం ఉదయం నుంచి వరుసలో నిలబడిన యూరియా దొరకడం లేదని రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఎంతో ఇబ్బంది పెడుతుందని వేలాది రూపాయలు పెట్టి వరి నాట్లు వేస్తే యూరియా కోసం పడుతున్న తిప్పలు రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడంలేదా అని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి యూరియా అందించాలని డిమాండ్‌చేశారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళులు

గజ్వేల్/గజ్వేల్ రూరల్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడంకోసం ఎనలేని సేవలు అందించారని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధానకార్యదర్శి నక్క రాములుగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సుఖేందర్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్లు కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ వాహిద్, అక్కారం యాదగిరి, నర్సాగౌడ్, కొండపోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, డిసిసిబి మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి ఆధ్వర్యంలో...

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ప్రజ్ఞాపూర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి టిపిసిసి ప్రచార కార్యదర్శి నాయిని యాదగిరి మంగళవారం ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డితో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె కృపానందం, నాయకులు ఉప్పల ప్రవీణ్‌గుప్త, తాళ్ల ఆంజనేయులు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు సయ్యద్ బాబా, మామిడి కృష్ణ, శాంతం స్వామి, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు బాలయ్య, రాజుగౌడ్, భాస్కర్, కొండా రవి, బంటి తదితరులు పాల్గొన్నారు.

అధికారులను సత్కరించిన టిపిఎస్ఎ ప్రతినిధులు

సిద్ధిపేట రూరల్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్యాలయంలో మంగళవారం ఎంవిఐ శంకర్‌నారాయణను తెలంగాణ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(టిపిఎస్ఎ) ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి మొమెంటో అందించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కారించి మొమెంటో అందించారు. కార్యక్రమంలో టిపిఎస్ఎ ప్రతినిధులు హనుమంతరెడ్డి, సంపత్, లింగం, కిరణ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, సంతోష్, రమేష్ తదితరులు ఉన్నారు.

నేరరహిత సమాజానికి సిసి కెమెరాలు చాలా ముఖ్యం

-పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ

సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ అనురాధ

గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

నేరరహిత సమాజానికి సిసి కెమెరాలు చాలా ముఖ్యమని, ఒక్క సిసికెమెరా 100మంది పోలీసులతో సమానమని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ పేర్కొన్నారు. మంగళవారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసి పరిసరాలను, సీజ్ చేసిన వాహనాలను, క్రైమ్ చాట్‌ను, రిసెప్షన్ రికార్డ్ రూమ్స్‌ను పరిశీలించారు. అనంతరం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన 16 సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిసికెమెరాల ఏర్పాటుకు సహకరించిన దౌల్తాబాద్ మండలకేంద్రంలో ఉన్న వ్యాపారస్థులు, ప్రజాప్రతినిధులను అభినందించారు. నేరాలను నియంత్రించడంలో, నిందితులను గుర్తించడంలో సిసి కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయని అన్నారు. ప్రజలకు భద్రత, సెన్సాఫ్ సెక్యూరిటీ కలిగించడంలో సిసి కెమెరాలు చాలా ముఖ్యమని, జిల్లాలో నేరాలు అదుపు చేయడానికి పోలీసులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సిసి కెమెరాలు ఉన్న ఇళ్లలో, కాలనీలలో, గ్రామాల్లో నేరస్థులు నేరం చేయడానికి భయపడతారని తెలిపారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున ప్రతి ఒక్కరు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అందుకు గ్రామస్థులు, స్వచ్ఛందసంస్థలు ముందుకురావాలని సూచించారు. విపిఓలు రెండు మూడు రోజులకు ఒకసారి గ్రామాలను సందర్శించి ప్రజలసమస్యలను తెలుసుకోవాలని సూచించారు. వివిధకేసుల్లో పట్టుబడిన వాహనాలను వాటి యజమానులకు అప్పగించాలన్నారు. ప్రజలరక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించడంతో పాటు ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇసుక, జూదం, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేయాలని సూచించారు. పాత నేరస్థులైన కెడిలు, డిసిలు, సస్పెక్ట్‌లను తరచుగా తనిఖీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎసిపి నరసింహులు, తొగుట సిఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్‌కుమార్, తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ జెడ్‌పిటిసి భూపాల్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, వ్యాపారస్థులు పాల్గొన్నారు.

వర్షాలకు నష్టపోయిన పంటలకు తక్షణమే ఎకరాకు రూ.50,000 చెల్లించాలి

పంట పొలాలను పరశీలిస్తున్న సిపిఎం నాయకులు

వట్‌పల్లి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

వర్షాలకు నష్టపోయిన పంటలాలను సర్వే చేసి తక్షణమే ఎకరాకు 50 వేల రూపాయలు చెల్లించాలని సిపిఎం ఆందోల్ డివిజన్ కార్యదర్శి డివిద్య సాగర్ అన్నారు.మంగళవారం వట్టిపల్లి మండల్ గౌతపురు గ్రామంలో సిపిఎం బృందం పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతపూర్ గ్రామంలో 70 ఎకరాల పంట నష్టపోయిందని రైతులు పంట చేతికి వస్తుందని ఆశతో ఉన్న రైతులకు అకాలవర్షాలవల్ల కన్నీరు మిగిలిందన్నారు. తక్షణమే పంట నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలన్నారు. పంట నీట మునిగి తీవ్రంగా దెబ్బతిని వారం రోజులైనా నేటికీ అధికారులు పర్యవేక్షించడం లేదని, రైతుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఉన్న పంట దెబ్బ తినడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారని, కౌలు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, తక్షణమే రైతాంగాన్ని ఆదుకోవాలని లేనిచో రైతాంగం పట్ల పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటి సభ్యులు రాములు, మండలనాయకులు నరేందర్‌గౌడ్, భీమయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలకు మండల రైతులు దరఖాస్తు చేసుకోవాలి

కంగ్టి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

2025 సంవత్సరానికి రైతులకు అందించే వ్యవసాయ పరికరాలకు రైతులు ధరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హరీష్ పవార్ తెలిపారు. కంగ్టి మండలంలోని అన్ని గ్రామాల రైతులు వ్యవసాయ పరికరాలకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా లరైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ అధికారి హరీష్ పవార్ తెలిపారు. కంగ్టి మండలనికి కేటాయించిన వ్యవసాయ పరికరాలు 1. 461 బ్యాటరీ స్ప్రేయర్లు 2. 61 పవర్ స్ప్రేయర్లు/పంపులు. 3. 22 రోటవేటర్లు. 4. 6 సీడ్ కమ్ ఫర్టిలైజెర్ డ్రిల్లులు. 5. 38 డిస్క్ హ్యారో/కల్టివేటర్/ఎంబి ప్లౌవ్/కేజీ వీల్. 6. 7 పవర్ వీడర్లు. 7. 2 బ్రష్ కటర్లు. 8. 2 పవర్ టీల్లర్లు. 9. 4 మొక్క జొన్న షెల్లెర్లు. 10. 1 స్ట్రా బేలర్ ఉన్నాయని తెలిపారు. దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకున్న అనంతరం మండల స్థాయిలో నియమించిన కమిటీ సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది, ఈ కమిటీ కన్వీనర్ గా మండల వ్యవసాయ అధికారి, సభ్యులుగా తహసీల్దార్, ఎంపిడిఓలు వ్యవహరించనున్నారు.ధరఖాస్తుకు కావాల్సిన ప్రతులు, ధరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ట్రాక్టర్ సంబంధించిన పరికరాలకు ఆర్ సి జిరాక్స్, బ్యాంక్ పాస్ పుస్తకం, 2 పాస్ ఫోటోలు, నెల సారానికి సంబంధించిన సాయిల్ హెల్త్ కార్డును తప్పనిసరిగా జతపరచి సంబంధిత రైతువేదికలోని క్లస్టర్ ఏఈఓ లేదా మండల వ్యవసాయ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా చెరుకు ముత్యంరెడ్డి వర్ధంతి

రాయపోల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

మాజీమంత్రి చెరుకు ముత్యంరెడ్డి 6వ వర్ధంతిని రాయపోల్ మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముత్యంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆనంతరం రాయపోల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తప్పెట సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య, అధికార ప్రతినిధి కృష్ణగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గప్రసాద్, కిష్టరెడ్డి, గోపాల్, మహేష్, పుర్ర నర్సింలు, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు యాదగిరి, చందు, రాజు పాల్గొన్నారు.

బిసి బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తంచేసిన కాంగ్రెస్ నాయకులు

-మాటల కాంగ్రెస్ కాదు, చేతల కాంగ్రెస్: పుట్ట నర్సింగరావు

గుమ్మడిదల, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర బిసి నాయకులు బ్రహ్మరథం పడుతున్నారని మంగళవారం గుమ్మడిదల మున్సి పాలిటీపరిధిలోని కాంగ్రెస్ నాయకులు మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు ఆధ్వర్యంలో మాజీ సిఎం దివగంతనేత స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, మాజీ ఎంపిటిసి సురభి నాగేంద్రగౌడ్, గోవర్ధన్ గౌడ్, మాజీసర్పంచ్ తులసిదాస్, నాయకులు పడమటి మహిపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, హజాం, భాస్కర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మొక్కలు నాటిన అధికారులు, ప్రధానోపాధ్యాయురాలు

మొక్కలు నాటుతున్న దృశ్యం

కంగ్టి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కంగ్టి లోని ప్రాతమిక పాఠశాల, జిల్లా ప్రజా పరిషత్ (హైస్కూల్)లో మంగళవారం స్థానిక ఎంపిడిఓ సత్తయ్య, అలాగే ప్రధానోపాధ్యాయురాలు శైలజ వారితోపాటు ఎంపిపో సుభాష్, ఉపాధ్యాయులు కిపాయత్ అలీ, యశ్వంత్, నర్సింహారెడ్డి, రాజు, చారిలు విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు.

అత్తింటి వేధింపులకు నవవధువు బలి

-మెదక్ జిల్లాలో ఘటన

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

అత్తింటి వేధింపులు భరించలేక ఓ నవవధువు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... చిన్నశంకరంపేటకు చెందిన వానరాసి రాధిక(19)కు ఇదే పట్టణానికి చెందిన కుమార్‌తో నెలరోజుల క్రితం వివాహం జరిగింది. వివాహం అయినప్పటి నుండి కుమార్, రాధికను మానసికంగా, శారీరకంగా వేధించేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈవిషయంపై కులస్థులు, పెద్దలసమక్షంలో సర్దిచెప్పిన ప్పటికీ కుమార్‌లో ఎలాంటిమార్పులు రాకపోగా వేధింపులు ఎక్కువయ్యాయి. భర్త కుమార్ పెట్టే వేధింపులు తట్టుకోలేక రాధిక మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అమ్మమ్మ లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు. అయితే మృతురాలి తండ్రి యాదయ్య 8 సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోగా, తల్లి సంవత్సరం క్రితం, అన్న శ్రీను ఆరు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుడు, కోడలు, మనుమడు, మనుమరాలు మృతితో అమ్మమ్మ లక్ష్మీ పడుతున్న బాధ వర్ణనాతీతం.

తండాలో పడకేసిన పారిశుద్ధ్యం

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

మండలంలో పలుగ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు పడకేశాయి. చిన్నశంకరంపేట మండలం ఎర్రకుంట పంచాయతీ పరిధి నాగులమ్మ తండాలో గత 20 రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించడంలేదని, చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్ రావడంలేదని తండావాసులు వాపోతున్నారు. దీనివల్ల దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తండావాసులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీకార్యదర్శి దృష్టికితీసుకెళ్లినా స్పందించడంలేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

బిసి డిక్లరేషన్ బిల్లు ఆమోదం చరిత్రాత్మక విజయం

-కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి



సిఎం చిత్రపటానికి క్షీ రాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు

అమీన్‌పూర్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని గత ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా అసెంబ్లీలో బిసిలకు 42శాతం బిసి బిల్లు ఆమోదం చారిత్రాత్మక విజయం అని అమీన్ పూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గం ఇంచార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శివాలయం చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ కామారెడ్డి బిసి డిక్లరేషన్ మేరకు బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కొరకు అసెంబ్లీలో పంచాయతీరాజ్ చట్ట సవరణ జరిపించి, బిసిలకు న్యాయం జరిగేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కిందని కొనియాడారు. బిసిలకు న్యాయంచేసే దిశగా కాంగ్రెస్ ముందుకు వెళుతుంటే బిఆర్ఎస్, బిజెపి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీరంగూడ శివాలయం చైర్మన్ సుధాకర్‌యాదవ్, ఆత్మకమిటీ సభ్యుడు మన్నె రవీందర్, అమీన్‌పూర్ మున్సిపల్ కాంగ్రెస్ సెక్రటరీ రమేష్‌యాదవ్, మండల అధ్యక్షుడు దొంతి అశోక్, భిక్షపతి ఆత్మకమిటీ సభ్యుడు, దీపక్‌గౌడ్ శివాలయం కమిటీ సభ్యుడు, ప్రకాష్, శ్రీనివాస యాదవ్, ఈశ్వర్‌రెడ్డి, కృష్ణయాదవ్, శ్రీనివాస్, శ్రీధర్, రామచంద్రారెడ్డి, గౌస్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్లు, నాయకులు

అమీన్‌పూర్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

కాళేశ్వరం ప్రాజెక్టు కేసును రాష్ట్ర ప్రభుత్వం సిబిఐకి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపుమేరకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గోపాల్, సీనియర్ నాయకులు తెలంగాణ ఉద్యమకారుడు సింగారం ఓం ప్రకాష్, ఐలాపురం మాణిక్‌యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ కౌన్సిలర్లు, నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కలల ప్రాజెక్టు అయిన కాళేశ్వరం దేశంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా లక్షలాది ఎకరాల భూమికి నీరందిస్తూ రైతుల పంటలకు ప్రాణవాయువులా మారిందని తెలిపారు. అలాంటి ప్రాజెక్టును కాంగ్రెస్‌పార్టీ సిబిఐ విచారణకు అప్పగించడంతో రైతులకు శాపంగా మారిందని తెలిపారు.

బిసిలకు రిజర్వేషన్ చరిత్రాత్మక నిర్ణయం

-కాంగ్రెస్ మెదక్ జిల్లా ఇంచార్జ్ ముజాయిత్ అలీఖాన్

-నర్సాపూర్‌లో భారీ ర్యాలీ, సంబరాలు

నర్సాపూర్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ నాయకులు టిపిసిసి ఉపాధ్యక్షులు ముజాయిత్ అలీఖాన్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, సీనియర్ నాయకులు పైడి శ్రీధర్‌గుప్తలు అన్నారు. మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42శాతాన్ని అమలు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు నర్సాపూర్ వచ్చి, నర్సాపూర్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తాలో టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు మల్లేశం, కృష్ణ, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, మల్లేశంగౌడ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మాజీ జెడ్పిటిసిలు శ్రీనివాస్‌గుప్తా, కమలాపుల్‌సింగ్, మాజీ ఎంపిపిలు లలిత నర్సింగ్ నాయక్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నవీన్‌గుప్తా, మాధవరెడ్డి, కుమ్మరి సురేష్, నరేందర్‌రెడ్డి, మణిదీప్, హరీష్‌వర్ధన్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

స్వర్గీయ వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

-నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

పేదప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, పైడి శ్రీధర్‌గుప్తలు అన్నారు. మంగళవారం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్‌పార్క్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం, కృష్ణ, సుదర్శన్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, కృష్ణ, నాయకులు నవీన్‌గుప్తా, మాధవరెడ్డి, మణిదీప్, రిజ్వాన్, రషీద్, శ్రీనివాస్‌గుప్తా, హరీష్‌వర్ధన్, యాదగిరిగౌడ్, శ్రావణ్‌కుమార్, కుమ్మరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచిగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

-మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి

**నర్సాపూర్

మాట్లాడుతున్న సంపత్‌రెడ్డి

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు అర్థరహితం

బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : ఎమ్మెల్సీ దేవునవల్లి కవిత చేస్తున్న వ్యాఖ్యాలు అర్థరహితమని బిఆర్ఎస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సూచన మేరకే కవిత మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుపై ఆరోపణలు,విమర్శలు చేస్తుందన్నారు. గతంలోనూ పల్లా, జగదీశ్వర్‌రెడ్డి, కెటిఆర్, సంతోష్, మధుసూదనచారిలపై ఆరోపణలు, విమర్శలు చేసిందని గుర్తు చేశారు. కవితకు గతంలో ఎంపి పదవి తెలంగాణ ఉద్యమం పెట్టిన భిక్ష అన్నారు. హరీష్‌రావును విమర్శించే కనీస నైతిక హక్కు కవితకు లేదన్నారు. కవిత జైలుకు వెళ్లితే బెయిల్ కోసం హరీష్‌రావు ఎంతో కష్టపడ్డారని తెలిపారు. కవిత జాగృతి పేరిట చేసిన వసూల్లు అన్ని బయటపడుతాయన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగరాజురెడ్డి, రవీందర్‌రెడ్డి, నాయకులు పొన్నమల్ల రాములు,పొడిశెట్టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అధికారి నిర్లక్ష్యం

ఫిర్యాదు చేసినా పట్టించుకోని చిన్నకోడూరు పోలీసులు

మాట్లాడుతున్న సిటిజెన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ శివచంద్రం

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న చిన్నకోడూరు ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సిటిజెన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ గుండ్ల శివచంద్రం, బాధితుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ, చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన బొబ్బల తిరుపతిరెడ్డి ఏలేటి రాజిరెడ్డికి మధ్య భూ వివాదం సిద్దిపేట కోర్టులో నడుస్తుంది. ఈ క్రమంలో బొబ్బల తిరుపతిరెడ్డికి అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చిందని అయిన రాజిరెడ్డి స్థలాన్ని అక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై చిన్నకోడూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఫిర్యాదు చేసినట్లు కనీసం రశీదు ఇవ్వమన్నా.. విచారణ చేసిన తర్వాత ఇస్తామని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కోర్టు ఆర్డర్ లెక్కచేయకుండా సివిల్ కేసులో తల దూర్చుతు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న చిన్నకోడూరు ఎస్ఐపై జిల్లా కలెక్టర్,సీసీ డాక్టర్ అనురాధ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై డిజిపికి ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీఆర్‌సీ సభ్యులు తుమ్మరాజు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెకాయ 'కాళేశ్వరం ప్రాజెక్టు'

రోడ్డుపై బైటాయించి ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

కోహెడ, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావులపై సీబీఐ విచారణకు నిరసరగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పిలుపు మేరకు కోహెడ మండల కేంద్రంలో మంగళవారం అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైటాయించి బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా బిఆర్ఎస్‌కు అనుకూలంగా నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మాట్లాడుతూ కెసిఆర్, హరీష్‌రావులపై కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా చర్యలకు దిగుతుందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజల గుండెకాయ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతోనే రైతులకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 2,ప్రభాతవార్త : ఉమ్మడి ఎపిలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేశారని..ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, ఆర్టీఏ సభ్యుడు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదల కోసం ఎన్నో పథకాలు చేపట్టి అమలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ, పార్టీ నాయకులు దాసరి రాజు,మంద పాండు, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26 వేలు అమలుచేయాలి

కోహెడ, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : ఆశా కార్యకర్తలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని...కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. కోహెడ మండలలోని ఆశా కార్యకర్తలు టిఆర్ఎస్‌కెవి సంఘం నుంచి సిఐటియులో చేరిన సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఎఎన్‌సి, బిపి టెస్టు టార్గెట్ పెట్టొద్దన్నారు. రెండు యేండ్ల క్రితం లెప్రసి సర్వే చేసిన డబ్బులను నేటికి చెల్లించకపోవడం సరికాదన్నారు. ఆశా కార్యకర్తలు నిరంతరం పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు.డబ్ల్యుహెచ్ఓ అంతర్జాతీయ సంస్థ ఆశా కార్యకర్తలకు గ్లోబెల్ హెల్త్ లీడర్స్ అవార్డును అందించిందని గుర్తు చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశా కార్యకర్తల యూనియన్ ప్రతినిధులు సింగిరెడ్డి చంద్రారెడ్డి, కాటం మధు, అశోక్, విష్ణు, శ్రీజ్యోతి, రజిత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు గోపాలస్వామి

కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభం

బిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మల దహనం, ధర్నాలు, రాస్తారోకోలు

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు/నంగునూర్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త :

మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుల ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ సర్కార్ విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తుందని బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, రాష్ట్రకార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. మాజీ సిఎం, మాజీ మంత్రి హరీష్‌రావులపై సీబీఐ విచారణకు కాంగ్రెస్ సర్కారు సిఫార్సు చేయడాన్ని నిరసిస్తూ నంగునూర్ మండలం పాలమాకుల వద్ద సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి సిద్దిపేట-హన్మకొండ రహదారిపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నారాయణరావుపేటలో ఆందోళన చేపట్టి తెలంగాణ తల్లి చౌరస్తాలో మానవహారంచేసి నిరసన తెలిపారు. చిన్నకోడూరులో ఆందోళన చేపట్టి సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ఆందోళన చేపట్టి రంగనాయకసాగర్‌పై వంద మీటర్ల బ్యానర్ ప్రదర్శన చేశారు. అలాగే సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఆందోళన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పతనం పురిటి గడ్డ నుంచే ప్రారంభమైందన్నారు. రైతులకు

రంగనాయకసాగర్‌పై వంద మీటర్ల బిఆర్ఎస్ బ్యానర్ ప్రదర్శించి నిరసన వ్యక్తంచేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

సాగునీరు ఇచ్చినందుకు సీబీఐ విచారణ చేస్తున్నారని ప్రశ్నించారు.సిఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేయడం కాదు రంగనాయకసాగర్‌కు వచ్చి చూడాలని చెప్పారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, బిఆర్ఎస్, కెసిఆర్, హరీష్‌రావులకు అనుకూలంగా నినాదాలతో హోరెత్తించారు. ఆయా కార్యక్రమాలలో మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు మారెడ్డి రవీందర్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, గుండు భూపేష్, మోహన్‌లాల్, మాణిక్యరెడ్డి, కాముని ఉమేష్‌చంద్రం, కాముని శ్రీనివాస్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సోమిరెడ్డి,సారయ్య, సదానందం, జంగిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాడిపల్లి భాస్కర్

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

-మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్

గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి నాయకులు సిద్ధం కావాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం గజ్వేల్‌లో మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని 26మండలాల్లో భారతీయ జనతా పార్టీ ప్రభావం చూపుతుందన్నారు. జెడ్‌పిటిసి, ఎంపిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుపొందుతామన్నారు. సిద్దిపేట జిల్లా పరిషత్‌ను సైతం కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. 508 గ్రామ పంచాయతీల్లో సగానికిపైగా బిజెపి నాయకులు గెలుపొందుతారన్నారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ఆధ్వర్యంలో బిజెపి బలోపేతానికి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురేష్, నాయిని సందీప్, వెంకట్‌రెడ్డి, సుభాష్‌చంద్రబోస్, రామచంద్రాచారి, అరవింద్, నాగు ముదిరాజ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా హబ్‌గా హుస్నాబాద్‌ను తీర్చిదిద్దుతాం

జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా గ్రంధాలయ చైర్మెన్ లింగమూర్తి

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త : స్థానిక శాసనసభ్యులు, రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో హుస్నాబాద్ ప్రాంతాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామని జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి అన్నారు. మంగళవారం రోజున పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కోకో, కబడ్డి, వాలీబాల్, పోటీలను మండల విద్యాశాఖ అధికారి బండారు మనీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రారంభించిన ఈ పోటీలు మూడురోజులు జరగనున్నాయని, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను మండల, జిల్లా స్థాయిలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. ప్రతీ రోజులు క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు శరీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.

బిఆర్ఎస్ పార్టీని బద్నాం చేస్తే ఊరుకోం

-మర్కుక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): బిఆర్ఎస్ పార్టీని బదనాం చేసేందుకు ప్రయత్నించే ఎంతటివారినైనా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఉపేక్షించబోరని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాజీమంత్రి హరీష్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్‌లపై విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కూతురై ఉండి ఇలాంటి విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కెసిఆర్ వల్లే ఎమ్మెల్సీ కవితకు పేరు వచ్చిందని, అలాంటిది తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. కల్వకుంట్ల కవితపై కెసిఆర్ తీసుకున్న నిర్ణయం సరైందే అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీకి వెన్నెముక అని, పార్టీని ఎవరు ఏమన్నా సహించబోరన్నారు. ఎమ్మెల్సీ కవిత ఎవరో చెప్పిన మాటలు పట్టుకొని కెసిఆర్ కుటుంబాన్ని బదనాం చేసే పనిలో ఉందన్నారు. మాజీ సిఎం కెసిఆర్ కుమార్తె అని మాకు ఇంకా గౌరవం ఉందని, ఆ గౌరవాన్ని వమ్ము చేసుకోవద్దని హితవు పలికారు.

బిసిలకు న్యాయంచేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు : రాగి రాములు

రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : బీసీలతో మోసపూరిత రాజకీయాలు ఆడుతున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు మండిపడ్డారు. మంగళవారం నాడు ఆయన మాట్లాడుతూ బీసీ జనాభా రాష్ట్రంలో 56శాతం ఉన్నప్పటికీ వారికి న్యాయం చేయాలనే ఆలోచన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీలో తీర్మానం, ఆర్డినెన్స్ తర్వాత జీవో అనే పేరుతో రోజుకో నాటకం ఆడుతూ బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజమైన బీసీల సమస్యల పట్ల నిరక్ష ్యం ప్రదర్శిస్తున్నారని మండిడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ముదిరాజులను బీసీ-డి నుండి బీసీ-ఏకు మార్చుతామని మాటిచ్చారని, కానీ ఆ వాగ్దానాన్ని విస్మరించడం ముదిరాజులను మోసం చేయడమే" అని ఆరోపించారు. రాష్ట్రంలో 60-70 లక్షల మంది ముదిరాజులు ఉన్నారని, కేవలం ముదిరాజులకు ప్రత్యేకంగా 7 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు."ముదిరాజుల డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోతే, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మట్టిలో కలిసిపోతుందని, ముదిరాజ్ సమాజం బీసీలతో ఏకం అయ్యి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి" అని హెచ్చరించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ వెంటనే అమలు చేసి, ముదిరాజులను బీసీ-డి నుండి బీసీ-ఏకు మార్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్రస్థాయి నిరసన బాట పట్టిందని తెలిపారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు ముమ్మరం

నర్వయ్యకుంటలో వేస్తున్న బారికేట్లను పరిశీలిస్తున్న దేవేందర్

రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : రామాయంపేట మున్సిపాలిటీలో జరగనున్న వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు మున్సిపల్ కమీషనర్ దేవేందర్ తెలిపారు. మంగళవారం నాడు పట్టణంలోని సర్వేకుంట సమీపంలో వినాయక నిమజ్జనం సందర్భంగా బారికేట్లు, లైటింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిమజ్జనం నాడు పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, ఎలక్ట్రిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : సిఐ

గజ్వేల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని గజ్వేల్ సిఐ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి సిఐ రవికుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగిందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. భావితరాలను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటాలన్నారు. మొక్కలు సమతుల్యమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయన్నారు. నేడు నాటిన మొక్కలే రేపటి వృక్షాలు అని భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడానికి ఉపయోగపడతాయన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ యాదగిరి, హెడ్ కానిస్టేబుల్ జగన్మోహన్‌రెడ్డి, బాలబ్రహ్మం, వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సిఐ రవికుమార్

ఇచ్చిన హామీల అమలులో సర్కారు విఫలం

బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు...గ్యారెంటీ లేకుండా పోయిందని జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్ అన్నారు. సిద్దిపేటలోని ఆర్డీఓ. కార్యాలయం ఎదుట మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 66 సబ్ గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటిపోతున్నా ఏ ఒక్క హామీకి గ్యారెంటీ లేదన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు రూ.15 వేల రైతు భరోసా, మహిళలకు నెలకు రూ.2500 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.గృహజ్యోతి పథకంలో సర్కార్ మహిళ



మాట్లాడుతున్న శంకర్ ముదిరాజ్

లను మోసం చేసిందన్నారు. వికలాంగులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచి ఇవ్వాలన్నారు. రైతులకు అన్ని పంటలకు బోనస్ ఇచ్చి అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన సర్కార్‌ను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగ రామచంద్రారెడ్డి, రామచంద్ర రావు, గుండ్ల జనార్ధన్, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, గాడిపల్లి భాస్కర్, విభీషణ్‌రెడ్డి, జస్వంత్‌రెడినడ, సుభాష్‌రెడ్డి, తుంగ కనకయ్య,సంతోష్, మారెడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్ మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటన

వర్గల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సిద్దిపేటజిల్లా కలెక్టర్ హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను భూభారతి చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం డిస్పోజల్ ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ రఘువీర్‌ను ఆదేశించారు. కుల, ఆదాయ, రెసిడెన్షియల్ ఇతరత్రా సర్టిఫికెట్‌లు వెరిఫై చేసి పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత కాల వ్యవధిలో తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. కాగా మండలం మొత్తం 367 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 244 మార్కింగ్ చేశామని 38 మంది కట్టుకోవడానికి సుముఖంగా లేరని ఎంపిడివో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇసుక, మొరం పోలీస్, రెవెన్యూ అధికారులు మానిటర్‌చేసి ఇందిరమ్మ ఇళ్ళకే వెళ్లేలా చూడాలని తెలిపారు. పిఎంఏవైలో అప్లోడ్ చెయ్యడం పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని నెంటూర్ గ్రామంలో పర్యటించి డ్రై డే, శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇంటి నిర్మాణంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ కూడా మెరుగ్గా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించి మెనూ పాటించకపోవడంతో ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూప్రకారం రుచికరమైన ఆహారాన్ని వేడిగా ఉన్నప్పుడే పిల్లలకు పెట్టాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. మీనాజీపేట గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 600 స్క్వేర్ ఫీట్‌లోపే నిర్మించుకోవాలని, ఎక్కువగా నిర్మించుకుంటే డబ్బులు రావని లబ్ధిదారులకు సూచించారు. ఎలాంటి టెక్నికల్ సమస్యలు ఎదురైనా కలెక్టరేట్‌లోని గృహ నిర్మాణ శాఖ అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వంటగది పరిసరాల్లో చెత్తచెదారం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి మునగ చెట్లు పెట్టారా, ఎలా ఉన్నాయో చూసి వారంలో రెండు రోజులు కూరల్లో మునగాకు వంట చేసి విద్యార్థులకు పెట్టాలని, ఆరోగ్యానికి చాలా మంచిదని ప్రిన్సిపల్‌కు తెలిపారు. కలెక్టర్ వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్

దుబ్బాక, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులు దూరమవుతాయని మున్సిపల్ కమిషనర్ కే.రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ మూడవ వార్డులో డ్రైడే ఫ్రైడేలో భాగంగా చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో నీటిని తొలగించి, బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్‌ని సిబ్బందితో వేయించారు. అనంతరం కస్తూరిబా బాలికల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించి పారిశుధ్య పనులను, దోమల నివారణకు చేపట్టిన ఫాగింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను తడి, పొడిగా వేరుచేసి, చెత్త సేకరణ చేసే వాహనాలకు అందించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని సూచించారు. ఆయన వెంట వార్డు అధికారులు, మెప్మా ఆర్పిలు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, పారిశుధ్య సిబ్బంది, ఉన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

శివ్వంపేట, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) : పంచాయతీ కార్మికులు కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎంపీఓ తిరుపతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. పంచాయతీ కార్మికులను వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తే సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు వసంత, భిక్షపతి, భాగయ్య, డి బిక్షపతి, మల్లేశం, సంజీవ, రాములు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : ఎంఇవో

జోగిపేట,సెప్టెంబర్ 02,ప్రభాతవార్త: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలవల్ల శారీరక ధారుఢ్యంతోపాటు మానసికోల్లాసం కూడా లభిస్తుందని మండల విద్యాధికారి కృష్ణ అన్

బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

ధర్నాలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

హత్నూర, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై సిబిఐ అక్రమకేసును ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం హత్నూరమండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో హత్నూర మండలం వివిధగ్రామాలకుచెందిన బిఆర్ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు హాజరై నర్సాపూర్ సంగారెడ్డి ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించి ధర్నాచేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యూత్, సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్‌తో బిసిలకు న్యాయం

మాట్లాడుతున్న బిసి టిజెఎసి జిల్లా ఇంచార్జ్ రమేష్‌యాదవ్

మునిపల్లి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రతిగ్రామంలో బిసిలు సర్పంచులుగా, ఎంపిటిసిలుగా, జెడ్పిటిసిలుగా గెలుస్తారని ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో విలేకర్లతో మాట్లాడుతూ 70సంవత్సరాలుగా బిసిలు వెనుకబడి పోయారన్నారు. విద్యాపరంగా, రాజకీయపరంగా బిసిలను ఎదగనివ్వలేదన్నారు. నేడు బిసిలు అంటే ఓటు వేసే యంత్రాల్లాగా మిగిలిపోరన్నారు. గ్రామగ్రామాన బిసి నినాదం వినబడుతుందంటే కేవలం తీన్మార్ మల్లన్న వల్లనే బిసిలు ఐకమత్యంగా రాజ్యాధికారం దశలో నడుస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో టిజెఎసి నాయకులు జగన్, అంజయ్య, రాజలింగం, మహేష్‌గౌడ్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన దర్గా ఉత్సవాలు

మనూర్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

మండల పరిధిలోని రాయిపల్లిలో కొనసాగుతున్న 40వ దర్గా ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిసాయి. దర్గాకు ఆయా ప్రాంతాల నుంచి (కర్ణాటక, మహారాష్ట్ర) చేరుకున్న పీఠాధిపతులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకు గంధాల ఊరేగింపు, కవాలి తదితర సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. దర్గాకు చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాల అందచేశారు.

పేటలో ఘనంగా వినాయకుడి పూజలు

సదాశివపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

సదాశివపేట ఎకోవాలి వెంచర్లో గల సిద్ధి వినాయకుడికి భక్తులు ఘనంగా పూజలు జరిపారు. సిందోల్ వినోద్ ఆధ్వర్యంలో వారి దంపతుల చేత శ్రీకాంత్‌పంతులు గణనాథునికి శాస్త్రోక్తంగా అష్టోత్తర శతనామావళి పఠిస్తూ పూజలు జరిపారు. కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్ ఇలియాస్ షరీఫ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మాజీ కౌన్సిలర్ వీరేశం, ఎల్ల బజార్ వీరశైవసమాజం అధ్యక్షులు గంధిగా బసవరాజ్, సమాజ సభ్యులు 198384 పదవతరగతి పూర్వ విద్యార్థుల మిత్రబృందం అధ్యక్షుడు గంట శివయ్యతోపాటు వారి మిత్రులు హౌసింగ్ బోర్డ్ కాలనీవాసులు, ఎకోవాలి వెంచర్లోని కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ క్రీడాపోటీలు ప్రారంభం

విద్యార్థులతో కబడ్డీ ఆడుతూ పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్

పుల్‌కల్/చౌటకూరు, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందుకుంటున్న విద్యార్థులతో మండల స్థాయి గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీలను మంగళారం అధికారులు ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి తహసీల్దార్ అనుదీప్ కూతకూస్తూ కబడ్డీపోటీలను ప్రారంభించారు. అండర్ 14,17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి పేర్కొన్నారు. పుల్‌కల్ మండల క్రీడలు సింగూరు గురుకుల పాఠశాల మైదానంలో, చౌటకూరు మండల క్రీడలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభం అయ్యాయి. మండల స్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సుభాష్‌బాబు, భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీలకు సై అంటున్న క్రీడాకారులు

-హద్నూర్ జడ్పిహెచ్ఎస్‌లో ఎస్‌జిఎఫ్ పోటీలు

హద్నూర్ జడ్పిహెచ్ఎస్‌లో మండలస్థాయి ఎస్‌జిఎఫ్

న్యాల్‌కల్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలను మండల అధికారులు ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిలో ఆటలు ఆడాలని ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంఈఓ మారుతి రాథోడ్, ఎస్ఐ దోమ సుజిత్‌లు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందుకున్న విద్యార్థులు పాల్గొని క్రీడల్లో తలపడ్డారు.

కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

వట్‌పల్లి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం వట్‌పల్లి మండల అధ్యక్షులు రమేష్ జోషి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ కచూర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మన్నె ఈశ్వరయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కృత్రిమ ఇసుక తయారీ, రవాణా

-పట్టించుకోని అధికారులు

హత్నూర, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

వాల్టాచట్టాన్ని అతిక్రమిస్తే కఠినచర్య తీసుకుంటామని ప్రభుత్వాధికారులు ఒకవైపు చెబుతున్నప్పటికీ హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామం పరిధిలో ఇసుక కృత్రిమ తయారీ, అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుందని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు. కృత్రిమ ఇసుకను తయారుచేసి బహిరంగంగా ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు లారీలలో తరలిస్తున్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని వారు విమర్శిస్తున్నారు. ఇంటికొరకు ట్రాక్టర్ ఇసుక తీసుకుంటే పట్టుకొని వేధించే అధికారులు, లారీలలో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో మేజర్ గ్రామపంచాయతీ దౌల్తాబాద్ గ్రామ శివారులో, కృత్రిమ ఇసుక తయారుచేసి బహిరంగంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తూ ఉండటంతో, ఇసుక తయారీ, రవాణా యథేచ్ఛగా జరుగుతుందని వారు విమర్శిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు పలువురు కోరుతున్నారు. సోమవారం దౌల్తాబాద్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలించడానికి లారీ సిద్ధంగా

దౌల్తాబాద్ శివారులో డంపు చేసిన ఇసుక నిల్వ

ఉందని సమాచారం అందడంతో, హత్నూర పోలీసులు అక్కడికి వెళ్లి లోడ్‌తో ఉన్న ఒక లారీని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై హత్నూర తహసీల్దార్ ఫర్హిన్ షేక్ మాట్లాడుతూ దౌల్తాబాద్ శివారులో డంపు చేసి ఉన్న ఇసుకను సీజ్‌చేసి, పంచాయతీ కార్యదర్శికి అప్పగిస్తామని, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని అన్నారు. అక్రమ ఇసుక రవాణా గురించి తెలిస్తే ప్రజలు సమాచారం ఇస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేద్దాం

-ఎమ్మెల్యే డాక్టర్ వట్లోళ్ల సంజీవరెడ్డి



కమలాపూర్ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూర్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

సహజ సౌందర్యం, చారిత్రాత్మక ప్రాధాన్యతలు గల మండల పరిధిలోని బోరంచ, కమలాపూర్ ప్రాంతాలను పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం బోరంచ కమలాపూర్ ప్రాంతాలను టూరిజం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ఆయాప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకొరకు సౌకర్యాలు కల్పించేందుకు కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రత్యేకప్రణాళికలు రూపొందిస్తోందని పేర్కొన్నారు. బోరంచ కమలాపూర్ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోని పర్యాటక పటంలో చేర్చాలన్నదే తనలక్ష్యం అన్నారు. బోరంచ కమాపూర్‌లను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు దక్కుతాయని ప్రజలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో టూరిజం ప్రాజెక్టు మేనేజర్ వైఆర్‌కె రాజు, ఉదయ్, దారం శంకర్‌సేట్, పండరిరెడ్డి, ఆకాశరావుపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే

దర్గాకు చాదర్‌ను తీసుకుపోతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూర్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

మండల పరిధిలోని రాయిపల్లిలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న 40వ దర్గా ఉత్సవాలకు ఎమ్మెల్యే డాక్టర్ వట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం హాజరై దర్గాకు చాదర్‌ను, గంధాన్ని, పూలను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకు చేరుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డిని దర్గా కాజీ శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఎమ్మెల్యేవెంట కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రామచందర్, బి.రాజు, నాగోబారావు, జాని పటేల్, మాశు పటేల్, ఫిరోజ్, ఇమ్రాన్, ముల్తాని, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ముక్తాపూర్‌లో బియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ వట్లోళ్ల సంజీవరెడ్డి రేషన్ బియ్యంను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గతంలో పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయని, అందించని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి బడుగుబలహీన వర్గాలకు రేషన్‌కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను రేషన్ డీలర్లు, నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, రేషన్‌కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

హత్నూర, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

హత్నూర మండలంలోని తురకల ఖానాపూర్, తాహెర్వాన్పేట్ గ్రామాలకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు మంగళవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలంగాణ పిసిసి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన ఎంఎ హకీమ్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు. ఈకార్యక్రమంలో హత్నూర మండలపార్టీ అధ్యక్షుడు కర్రె కృష్ణ, మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకులు ఎంఎ హకీమ్, చింతల కరుణాకర్‌రెడ్డి, కోణ్యాల వెంకటేష్, చంద్రగౌడ్, నరసింహారెడ్డి, మణిదీప్, కుటంలో వెంకటేష్, యాదగౌడ్, సతీష్, రంజిత్‌రెడ్డి, శ్రీకాంత్, ఆంజనేయులు నాగారం నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు తగవు

-జాతీయ రహదారిపై ఎమ్మెల్యే ధర్నా

జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని నిరసన వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు పట్టణంలోని బస్టాండు ఎదురుగా జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై కుట్రలు పన్నడమే కాకుండా తెలంగాణ నదీజలాలను పక్క రాష్ట్రాలకు తరలించి కాళేశ్వరాన్ని ఎండబెట్టే ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. కార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంగం, మొగుడంపల్లి, కోహీర్, న్యాల్‌కల్ మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవరెడ్డి, నర్సింలు, మున్నూర్ రవీందర్,ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, పట్టణ మాజీ అధ్యక్షులు మొహియుద్దీన్, మాజీ ఎంపిపి అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్వర్, మాజీ కేతకి ఆలయకమిటీ చైర్మన్ నరసింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

త్రినేత్ర ఆధ్వర్యంలో అన్నదానం

చౌటకూరు, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కొలువుదీరిన గణనాథుడి మండపం వద్ద త్రినేత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ రవికుమార్ హాజరై భక్తులకు అన్నదాన వితరణ చేశారు. భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుడిని పూజించుకుని ప్రశాంత వాతావరణలో నిమజ్జనం కార్యక్రమం జరుపుకోవాలని మండల ప్రజలకు సిఐ రవికుమార్ సూచించారు. అన్నదానం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని యూత్ అసోసియేషన్ బాధ్యులను సిఐ అభినందించారు. కార్యక్రమంలో త్రినేత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షులు, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై దుమ్మెత్తి పోయడం మానుకోవాలి

-వట్‌పల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ నిరసన

ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

వట్‌పల్లి, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపుమేరకు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆదేశాలమేరకు వట్‌పల్లిమండల కేంద్రంలో మండల బిఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కాళేశ్వరంపై దుమ్మెత్తిపోయడంమానుకోవాలని ఫ్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్‌ప్రభుత్వం రేవంత్‌రెడ్డికమిషన్, సిబిఐ అని కాలయాపన చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపం ఉంది అని చేతగాని మాటలు మాట్లాడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం రైతులకు వరప్రదాయిని అని ప్రపంచంలో నెంబర్‌వన్ అని ప్రజలు హర్షిస్తుంటే కాంగ్రెస్ వాళ్ళు ఏడుస్తున్నారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చెయ్యలేక ప్రతిపక్షం మీద బురద జల్లడమే రేవంత్‌రెడ్డి చేస్తున్నపని అని మండలనాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వరము మాజీచెర్మన్ వీరారెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి శివాజీరావు, మండల సర్పంచ్‌ల ఫోరమ్ మాజీ అధ్యక్షులు సురేఖబుద్దిరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి బస్వరాజ్, మండల రైతుబంధు మాజీ అధ్యక్షులు అశోక్‌గౌడ్, మాజీ ఎంపిటిసిలు నర్సిములు, సదానందం, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్‌లు మధు, శ్రీనివాస్‌గౌడ్, గ్రామపార్టీ అధ్యక్షులు ప్రకాష్, నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్, మారుతిరావు, చెంద్రశేఖర్, సంగమేష్, ఎల్లగౌడ్, మోసిన్, రాజేందర్‌రావు, బాలాజీరావు, మల్లయ్య, బాగారెడ్డి, సాయిలు, దశరథ్, ఖలీల్, గుండయ్య, విఠల్‌నాయక్, నర్సిములు, జహంగీర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు, రేషన్‌కార్డుల పంపిణీ

-హామీలన్ని అమలు చేస్తున్నాం-మార్కెట్ కమిటి చైర్మన్

అల్లాదుర్గం, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రతి హామిని అమలు చేస్తూ వస్తోందని మార్కెట్‌కమిటీ చైర్మన్ లక్ష్మి శేషారెడ్డి అన్నారు. మంగళవారం కొత్తగా మంజూరైన కొత్త రేషన్ కార్డులను, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి చైర్మన్ లక్ష్మి శేషారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డిలు మాట్లాడుతూ గతంలో పదేళ్లుపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయని, అందించని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందని ఆనందం వ్యక్తంచేశారు. 20మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కులను, 197మందికి కొత్త రేషన్ కార్డులను అందచేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు బలరాం, కాంగ్రెస్ నాయకులు డి.సుబ్బారావు దేశ్‌పాండే, వై. సదానందం, నరసింహారెడ్డి, బాలకిషన్, బేతయ్య, విఠల్‌రెడ్డి, జయపాల్, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్‌సేట్, చెన్నప్ప శేఖర్‌పాటిల్, రాములు, శ్రీనివాస్‌గౌడ్, విఠల్‌రెడ్డి, నాగరాజు, సాయిలు, సత్యనారాయణ, సరేష్‌గౌడ్, శ్రీకాంత్, యాదగిరి, తుకారాం, అంజయ్య, రవి, శ్రీశైలం, జైపాల్‌నాయక్, షరీఫ్, చక్రపాణి, రెవిన్యూ సిబ్బంది సందీప్, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మనూర్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన రేషన్ కార్డు లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ వట్లోళ్ల సంజీవరెడ్డి రేషన్ బియ్యం పంపిణి చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రేషన్ కార్డులు అందచేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రేషన్ బియ్యం అందచేసిన హాజరైన ఎమ్మెల్యే సంజీవరెడ్డిని రేషన్‌డీలర్లు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మైనోద్దిన్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు దిగంబర్‌రెడ్డి, దారం శంకర్ సేట్, పండరిరెడ్డి, రమేష్ చౌహాన్, మల్లికార్జున్, సాగర్, అశోక్‌రావు, శివాజీరావు, విలాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజి నిర్మాణానికి కార్పొరేటర్ శ్రీకారం



అండర్‌డ్రైనేజి నిర్మాణానికి శ్రీకారంచుడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం, సెప్టెంబరు 2, ప్రభాతవార్త:

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయిజ్యోతినగర్ కాలనీలో రోడ్డు నెంబర్ 7,8లో 30 లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణానికి మంగళారం జలమండలి మేనేజర్ లోకేష్‌తో కలిసి కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలనీలో మిగిలి ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను దశల వారీగా పూర్తి చేస్తామన్నారు. సిసి రోడ్డు నిర్మాణానికి నిధు మంజూరు చేయించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్తయ్యగౌడ్, రాజనర్సింహా, బలరాం, ప్రసాద్, శేఖర్‌రెడ్డి, మురళిరెడ్డి, శ్రీనివాస్, మోహన్, ఆర్వీ రాజు, బేగరి పెంటయ్య, జహంగీర్, నీలి రాజు తదితరులు పాల్గొన్నారు.

సిఎం అభివద్ధిచేసి చూపించాలి

-మండల పార్టీ అధ్యక్షులు రమణగౌడ్

శివ్వంపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు కాదు, అభివృద్ధిచేసి చూపించాలని మండలపార్టీ అధ్యక్షులు రమణగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన శివ్వంపేటలో విలేకరుల సమావేశం నిర్వహించి మండల పార్టీ అధ్యక్షులు రమణగౌడ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్‌లు మాట్లాడుతూ గతప్రభుత్వం కెసిఆర్ హయాంలో ఎన్నోవందలాది ఎకరాలకు నీళ్లు అందించాలనే ఉద్దేశంతో కాళేశ్వరం నిర్మిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా జరిగిన అసెంబ్లీలో కెసిఆర్‌పైన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ములుగు నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్లు చంద్రకళ, శ్రీశైలం, అశోక్‌రెడ్డి, రంగీలా ఆంజనేయులు, నాయకులు, మైపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, జగన్‌రెడ్డి, ముత్యంరెడ్డి, పంబాల విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

మండల 69వ ఎస్‌జిఎఫ్ పోటీలు ప్రారంభం

ఎస్‌జిఎఫ్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

సదాశివపేట, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త:

సదాశివపేట మండలంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను మంగళవారం స్థానిక సెయింట్ మేరీ పాఠశాలలో ప్రారంభించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు. మండల స్థాయిలో జరిగే వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో ప్రభుత్వ, ప్రైవేట్ మొత్తం 22పాఠశాలలకు సంబంధించి అండర్14,అండర్17 బాలురకు, బాలికలకు వేరువేరుగా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్.ఎం నిజాముద్దీన్, హెచ్.ఎం రాబర్ట్, వివిధ పాఠశాలల పిడి, పిఈటిలు శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌చంద్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, శ్రీధర్, భాస్కర్, రామకృష్ణ, కాజిమ్, శివప్రసాద్, సంగమేశ్వర్, పల్లవి, సౌజన్య, సిఆర్పి రాజేశ్వర్‌లు పాల్గొన్నారని ఎన్.శంకర్ తెలిపారు.

టేక్మాల్‌లో బిఆర్ఎస్ ధర్నా, రాస్తారోకో

టేక్మాల్ చౌరస్తాలో బిఆర్ఎస్‌శ్రేణులు ధర్నానిర్వహిస్తున్న దృశ్యం

టేక్మాల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కెసిఆర్‌పై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని టేక్మాల్ మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప అన్నారు. మంగళవారం టేక్మాల్ మండలకేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్, కమ్మరి సిద్దయ్య, సాయిలు, చింతరవి, బసంత్‌రావు. రమేష్‌నాయక్, సుధాకర్, సాయిబాబా, మహేందర్, సంగన్న, నారాయణ, గోవింద చారి, సురేష్, దుర్గేష్, రాములు, నాగయ్యా, మతీన్, మల్లేష్, సత్యనారాయణ, సంజీవుల్, యాదయ్య, రజాక్, బాలకృష్ణ, రమేష్, దుర్గయ్య, శ్రీనివాస్, హన్మగౌడ్, రాజునాయక్, కిష్టయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.